స్పందనకు స్వస్తి ..!

- గ్రామ సచివాలయాల్లో 'స్పందన' కార్యక్రమానికి చెల్లుచీటీ
- గత్యంతరం లేక మండలానికి పరుగు పెడుతున్న అర్జీదారులు
- ప్రజా సమస్యలపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం
- పట్టించుకోని అధికారులు

అగళి: పరిపాలన సౌలభ్యంలో భాగంగా గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో గ్రామ సచివాలయాల పరిధిలో రోజూ స్పందన కార్యక్రమం నిర్వహించే వారు. అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో రోజూ సాయంత్రం మూడు నుంచి నాలుగు గంటల వరకూ పంచాయతీ కార్యదర్శితో పాటు సచివాలయంలోని అధికారులందరూ ఈ స్పందనకు హాజరయ్యే వారు. గ్రామంలో ఏ విధమైన సమస్య ఉన్నా స్థానికంగా రోజూ గంట పాటు నిర్వహించే స్పందన కార్యక్రమంలో సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించడం జరిగేది. గ్రామంలోనే స్పందన కార్యక్రమం ఏర్పాటు చేయడంతో ప్రజలకు దూరభారం, ఆర్థిక ఇబ్బందులు, సమయం ఆదా అయ్యేది. దీంతో మండల స్థాయిలో నిర్వహించే స్పందనకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పోయింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వచ్చాక స్పందన కార్యక్రమానికి స్వస్తి పలికింది. ప్రజలకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. సచివాలయాల్లో ఎక్కడా కూడా ప్రజా సమస్యలపై అర్జీలు స్వీకరిస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. గ్రామస్థాయిలో స్పందన కార్యక్రమం నిర్వహించక పోవడంతో ప్రజలు మండల స్థాయి స్పందనకు వెళ్లాల్సిన పరిస్థితి తలెత్తింది. గత ప్రభుత్వం మాదిరిగానే గ్రామ స్థాయిలో స్పందన కార్యక్రమాన్ని పునరుద్ధరిస్తే వద్ధులు, మహిళలకు ఎంతో మేలు జరుగుతుందని చెబుతున్నారు.

పేరుకుపోతున్న సమస్యలు

గ్రామాల్లోని సమస్యలను అధికారులకు విన్నవించేందుకు మండల కేంద్రానికి వెళ్లాల్సి రావడంతో చాలామంది సమస్యలను చెప్పుకోలేక పోతున్నారు. దీంతో ఆయా గ్రామాల్లోని సమస్యలు ఎక్కడికక్కడే పేరుకుపోతున్నాయి. కూటమి ప్రభుత్వంలో మండల కేంద్రంలోనే స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నారు.



ఆర్జీ పల్లిలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయం

మహిళలు, వృద్ధులకు చాలా కష్టం



మండల కేంద్రంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి సుదూర ప్రాంతాల నుంచి రావాలంటే మహిళలు, వద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. రానుపోనూ బస్సు చార్జీలు పెట్టుకోవాల్సి వస్తోంది. ప్రజలకు ఇబ్బంది కలగకుండా గ్రామస్థాయిలో స్పందన కార్యక్రమం నిర్వహిస్తే బాగుంటుంది. గత ప్రభుత్వం మాదిరిగా ఇప్పుడు కూడా సచివాలయాల్లో స్పందన కార్యక్రమం నిర్వహించాలి.

– ముద్దరాజు, సర్పంచ్, హళ్లికేర పంచాయతీ

'స్పందన' కొనసాగించాలి



ప్రజా సమస్యలను దృష్టిలో ఉంచుకుని వెంటనే గ్రామస్థాయిలో స్పందన కార్యక్రమం నిర్వహించాలి. ఇలాంటి మంచి కార్యక్రమాన్ని నీరు గార్చకుండా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. గ్రామ స్థాయిలోనే సమస్యలను పరిష్కరించుకునేలా సచివాలయాల్లో గత ప్రభుత్వం మాదిరిగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలి.

– నాగేంద్ర, కందపల్లి

అర్జీలు ఇవ్వడం లేదు..

సచివాలయాల్లో స్పందన కార్యక్రమం జరుగుతోంది. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. ప్రస్తుతం సచివాలయాల్లో ప్రజల నుంచి ఎలాంటి అర్జీలు అందడం లేదు. ప్రజలు అర్జీలను అందజేస్తే సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తాం

– పద్మ, ఈఓఆర్డీ, అగళి మండలం

రక్షణ గోడను నాణ్యతగా నిర్మించాలి

పావగడ: తాలూకాలోని గుజ్జనడు, కోణనకుర్కె ప్రాంతానికి చెందిన ప్రజల కల నెరవేరుస్తున్నట్లు ఎమ్మెల్యే హెచ్.వి వెంకటేశ్ తెలిపారు. చెరువు నీటి ప్రవాహంతో దెబ్బతింటున్న కిలార్లహళ్ళి–దవడబెట్ట రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించినట్లు పేర్కొన్నారు. చెరువు నీరు రోడ్డు పైకి రాకుండా నిలువరించడానికి సుమారు రూ.1.26 కోట్ల వ్యయంతో నిర్మించనున్న రక్షణ గోడ నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శాశ్వతంగా నిలిచి పోయే రక్షణ గోడ నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. సాధ్యమైనంత త్వరలో రక్షణ గోడను నిర్మించాలని కాంట్రాక్టర్లు, ఇంజినీర్లకు సూచించారు. అయితే అదే రోడ్డు నుంచి చెరువు నీరు గుజ్జనడు సీహెచ్ పాళ్య వద్ద ఉన్న మొరార్జి దేశాయి వసతి పాఠశాలలోకి ప్రవహించి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే రక్షణ గోడ నిర్మించాలని డిమాండ్ చేస్తూ.. ఇటీవల స్థానిక జేడీఎస్ నాయకులు పాదయాత్ర నిర్వహించిన విషయం విదితమే. దీంతో ఎమ్మెల్యే వెంకటేశ్ స్పందించి రక్షణ గోడ నిర్మాణానికి భూమి పూజ చేసినట్లు ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. కార్యక్రమంలో ప్రథమ శ్రేణి కాంట్రాక్టర్ శంకరరెడ్డి, డా.కిరణ్ కుమార్, తాలూకా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుజిత్, మారణ్ణ, దేవరాజ్, శ్రీరామ్, పీడబ్ల్యూడీ ఈఈ హనుమంతరావు, ఏఈఈ అనిల్ కుమార్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్

వైభవంగా విగ్రహ ప్రతిష్ట

పావగడ: తాలూకాలోని కడమలకుంట గ్రామంలో ఆదివారం దుర్గాదేవి విగ్రహ ప్రతిష్టను వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ ఆలయాన్ని సందర్శించారు. దుర్గాదేవి విగ్రహానికి పూజలు చేయించారు. కార్యక్రమంలో స్థానిక పీఎల్డీ బ్యాంక్ అధ్యక్షుడు శేషగిరి, మున్సిపల్ కౌన్సిలర్ టెంకాయల రవి, బత్తినేని నాని, కేపీ నాగభూషణ, రామాంజినప్ప తదితరులు పాల్గొన్నారు.

హామీలన్నీ వెంటనే అమలు చేయాలి

మడకశిరరూరల్: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నింటినీ వెంటనే అమలు చేయాలని చౌటిపల్లికి చెందిన పలువురు మహిళలు డిమాండ్ చేశారు. పేదలందరికీ గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు స్థలం కేటాయిస్తామని చెప్పి నేటికీ తొమ్మిది నెలలు కావొస్తున్న హామీలను నెరవేర్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం మండలంలోని చౌటిపల్లి గ్రామంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఆర్‌జీ పవిత్ర, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రామచంద్రయ్య, రైతు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య తదితరులు పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజల సమస్యలను పట్టించుకోకుండా కేంద్ర రాజకీయ నాయకులకు ఊడిగం చేస్తున్నారని ఆరోపించారు. సోమవారం పుట్టపర్తి జిల్లా కేంద్రం కలెక్టరేట్ ముందు సీపీఐ ఆధ్వర్యంలో జరిగే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రామాంజనేయులు, నాగేంద్ర, అక్కమ్మ, ప్రమీళ, ధనుంజయ, శివమ్మ, నజరీన్, ముంతాజ్, ముబీనా, దేవీరమ్మ, మెట్టుబండప్ప, వెంకటమ్మ, ముద్దక్క, గౌరమ్మ, శృతి, రత్నమ్మ, నాగజ్యోతి, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు వ్యాఖ్యలు హేయం

మడకశిర రూరల్: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్తూరు జిల్లా పర్యటలో భాగంగా గంగాధర నెల్లూరులో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రతిపక్ష పార్టీలను ఉద్దేశించి మాట్లాడిన తీరును ఖండిస్తున్నాం. వైఎస్సార్‌సీపీ నాయకులకు ఎలాంటి పనులు చేయవద్దని వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఆనంద రంగారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. ఈ అంశాన్ని సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించి విచారణ చేపట్టాలని కోరారు. అందరికీ న్యాయం చేస్తామని ప్రమాణం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు.. ఆ విషయాన్ని విస్మరించి బహిరంగంగా ఇతర పార్టీల ఓటర్లు, సానుభూతి పరులకు ఎలాంటి లబ్ధి చేకూర్చవద్దని చెప్పడం రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమే అన్నారు. రాజ్యాంగం నచ్చిన పార్టీకి ఓట్లు వేసి, స్వేచ్ఛగా పని చేసే అవకాశం కల్పించిందన్నారు. ఇప్పటికే అర్హులైన చాలా మంది వైఎస్సార్‌సీపీ నాయకులకు పథకాలు అందకుండా అడ్డుకుంటూ అన్యాయం చేస్తున్నారని తెలిపారు. సీఎం చంద్రబాబు తన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అర్హులకు పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పోతలప్ప, చెన్నకేశవ స్వామి ఉత్సవాలు ప్రారంభం

పుట్టపర్తి టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని పెద్దకమ్మవారిపల్లిలో పోతలప్ప, చెన్నకేశవ స్వామి ఉత్సవాలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా భక్తులు ఎలవగంపను పురవీధుల్లో ఉరుములు, డప్పు వాయిద్యాల నడుమ ఊరేగించారు. అనంతరం పోతలప్ప ఆలయానికి చేరుకున్నారు. పోతలప్ప, చెన్నకేశవ స్వామి మూలవిరాట్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు వేలాది మంది భక్తులు తరలిరానున్నారు. సోమవారం ఉదయం పోతలప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి దాసంగాల మడుగు కార్యక్రమం, సాయంత్రం కమ్మవారిపల్లి చింత తోపులో ఎడ్లబండ్ల పోటీలు, నవరత్నాలు నాటకం ప్రదర్శించనున్నారు.



ఎలువగంపను ఊరేగిస్తున్న దృశ్యం

శివరాత్రి ఉత్సవాలు విజయవంతం

లేపాక్షి: పర్యాటక కేంద్రమైన లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయంలో గత నెల 25 నుంచి ఈ నెల 1వ వరకూ నిర్వహించిన మహాశివరాత్రి విజయవంతంగా ముగిశాయని ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్ ఆదివారం తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా శివరాత్రి రోజు భక్తులు జాగరణ చేయడానికి భారీగా సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు. బ్రహ్మ రథోత్సవం కచ్చితమైన సమయానికి ఊరేగించామని, ఇందుకు సహకరించిన గ్రామపెద్దలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పత్రికా విలేకరులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అంతేకాకుండా పూలపల్లకి రోజు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు కీలుగుర్రాల ప్రదర్శన ప్రజలను ఆకట్టుకుందన్నారు. ఉత్సవాల్లో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తాగునీరు, భోజనాలు, ప్రసాదాలు పంపిణీ చేశామన్నారు. దేవాలయ అభివృద్ధికి కూడా ఇలాగే తోడ్పాటు అందించి లేపాక్షి ఆలయాలనికి విచ్చేసే పర్యాటకులకు మంచి వాతావరణం కల్పించాలన్నారు.

గొర్రెల మందపైకి దూసుకెళ్లిన కారు



మృతి చెందిన గొర్రెలు

చెన్నేకొత్తపల్లి: ఎన్ఎస్ గేట్ సమీపంలోని జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం గొర్రెల మంద పైకి ఓ కారు దూసుకెళ్లడంతో ఐదు గొర్రెలు మృత్యువాత పడ్డాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. రామగిరి మండలానికి చెందిన గొర్రెల కాపరి గంగాధర్ ఆదివారం గొర్రెలను మేతకు తీసుకెళ్లాడు. ఎన్ఎస్‌గేట్ సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై గొర్రెల మంద రోడ్డు దాటుతుండగా.. వేగంగా వచ్చిన కారు అదుపుతప్పి గొర్రెల మందపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో 5 గొర్రెలు మృతి చెందగా.. గొర్రెల కాపరి గంగాధర్ స్వల్పంగా గాయపడ్డాడు. గాయపడిన వ్యక్తికి చెన్నేకొత్తపల్లి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

రొళ్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో సోమవారం ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ షేక్షావలి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేయాలని సూచించారు. మండల స్థాయి అధికారులు ఈ కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. హాజరు కాని అధికారులకు జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు మెమోలు జారీ చేస్తామని తెలిపారు.

మోటారు వాహనాల కొత్త చట్టాలపై అవగాహన



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి

ఓడీచెరువు: మోటారు వాహనాల కొత్త చట్టాలపై పోలీసులు ఆదివారం స్థానిక వైఎస్సార్ కూడలి వద్ద వాహనదారులకు అవగాహన కల్పించారు. బైక్‌పై ప్రయాణించే ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పని సరిగా ధరించాలన్నారు. బైకుపై వెనుక కూర్చున్న వ్యక్తి హెల్మెట్ ధరించాలని, లైసెన్స్ లేకుండా వాహనం నడపరాదన్నారు. కాలుష్య ధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలని, అతివేగంగా వాహనం నడపరాదని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డితో పాటు సిబ్బంది పాల్గొన్నారు

వీరనారాయణస్వామి హుండీ కానుకల లెక్కింపు

ముదిగుబ్బ: సంకేపల్లి వద్ద వీరనారాయణస్వామి పరుష రెండు రోజుల క్రితం ఘనంగా జరిగిన విషయం విదితమే. ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో హుండీని లెక్కించారు. మొత్తం రూ.7,45,627 నగదు వచ్చినట్లు వారు తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

ధర్మవరం అర్బన్: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ హేమంత్‌కుమార్ హెచ్చరించారు. పట్టణంలోని టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లు, సస్పెక్ట్స్ షీట్స్ ఉన్నవారికి డీఎస్పీ కౌన్సెలింగ్ నిర్వహించారు. జన జీవనానికి ఆటంకం కలిగించే ఎంతటి వారైనా చట్ట ప్రకారం కఠినమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. టూ టౌన్ సీఐ రెడ్డప్ప, పోలీసులు ఉన్నారు.

ఉపాధ్యాయులకు ఓరియెంటేషన్ ప్రోగ్రాం

పుట్టపర్తి టౌన్: కొత్తచెరువు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉపాధ్యాయులకు ఓరియెంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈసందర్భంగా ట్రైనర్ రామేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు స్పోకెన్ ఇంగ్లిష్‌పై ఆన్‌లైన్‌లో ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. తద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఆంగ్లంలో సులువుగా మాట్లాడే అవకాశం ఉంటుందన్నారు. దాదాపు 2500 మంది ఉపాధ్యాయులు హాజరైనట్లు తెలిపారు. ఈసందర్భంగా ఆయన డీఈఓ కిష్టప్పకు కృతజ్ఞతలు తెలియజేశారు.



అమరాపురంలో రేషన్ సరుకుల కోసం క్యూలో నిల్చున్న లబ్ధిదారులు

రేషన్‌కు తప్పని తిప్పలు

అమరాపురం: మండల కేంద్రంలో రేషన్ సరుకుల కోసం లబ్ధిదారులు గంటల కొద్దీ వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఉదయమే వెళ్లి క్యూలో నిలబడితేనే చౌకధాన్యపు డిపోలోని సరుకులు అందుతాయి. రెండు లేదా మూడు రోజులు సరుకులు ఇచ్చి స్టాక్ లేదు అంటూ ఎక్కడ బోర్డు పెడతారో అని పేదలు భయపడుతున్నారు. గతంలో జగనన్న ప్రభుత్వంలో ట్రక్కుల ద్వారా ఇంటింటికీ నిత్యావసర సరుకులను అందించే వారు. ఇంటింటికీ బియ్యానికి స్వస్తి పలికేందుకు కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. డీలర్లు అధిక సంఖ్యలో తమ ఇంటి వద్ద లేదా అద్దె ఇంటి వద్ద సరుకులను విక్రయిస్తున్నారు. అటు అధికారులు కూడా చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు.

నేడు 'కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ లీడర్స్'

పరిగి: మండలంలోని ఊటుకూరులో సోమవారం 'కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ లీడర్స్' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ నరసింహమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గ్రామంలో ఉదయం 6 గంటలకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తప్పక పాల్గొనాలని కోరారు.

శుభకార్యం

పరిగి: మండలంలో ఆదివారం జరిగిన శుభకార్యాల్లో మాజీ మంత్రి, నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ పాల్గొన్నారు. ధనాపురంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తిమ్మారెడ్డి గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. పరిగికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత కిరణ్‌రెడ్డి కుమారుడు నామకరణ వేడుకలో పాల్గొన్నారు. చిన్నారి మన్విక్‌రెడ్డిని ఆశీర్వదించారు. మండల కన్వీనర్ నరసింహమూర్తి, పలువురు ప్రజాప్రతినిధులు, మండల, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుడిబండ: మండల పరిధిలోని ఫళారం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రామన్న కుమారుడు రమేష్ వివాహం ఆదివారం పావగడ తాలూకా కన్నమేడిలో జరిగింది. ఈ వివాహ వేడుకలకు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప పార్టీ శ్రేణులతో హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా పెళ్లి కొడుకు తండ్రి రామన్న వైఎస్సార్‌సీపీ నాయకులను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామిరెడ్డి, నాయకులు నంజుండప్ప, బండెప్ప, ముడుపే గౌడు, ఈశ్వర తదితరులు పాల్గొన్నారు.

పురస్కారాలకు ముగ్గురు ఎంపిక





రామచంద్రప్ప చెలువరాజన్ సణ్ణనాగప్ప

పావగడ: వైఎస్ హొసకోటకు చెందిన కన్నడ కళ, సాంస్కృతిక మండలి అందించే పురస్కారాలకు తాలూకాలోని ముగ్గురు సాహితీ వేత్తలు ఎంపికైనట్లు ఆ మండలి అధ్యక్షుడు ఏఓ నాగరాజు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తాలూకా వ్యాప్తంగా చాలా సంవత్సరాలుగా కన్నడ భాష, సంస్కృతి ప్రగతి కోసం పాటు పడిన సాహితీ వేత్తలు హెచ్‌బి రామచంద్రప్ప (కస్తూరి తిలక), చెలురాజన్ (కళాసిరి) సణ్ణ నాగప్ప (లేఖనసిరి) పురస్కారాలకు ఎంపికయ్యారని తెలిపారు. వీరికి ఈనెల 8న వైఎస్ హొసకోటలోని ప్రభుత్వ బాలల పాఠశాల ఆవరణలోని రంగమందిరంలో పురస్కారాలు అందజేయడం జరుగుతుందన్నారు. ఏర్పాటు చేసే ప్రశస్తి ప్రదాన కార్యక్రమంలో అందిస్తామన్నారు. కార్యక్రమంలో మండలి గౌరవాధ్యక్షుడు డాక్టర్ హెచ్.కె. నరసింహమూర్తి, కార్యదర్శి పీవీ విశ్వనాథ్, కవి హోమా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రీకాట్ మిల్లు మూసివేతను ఆపండి

పెనుకొండ: ప్రీకాట్ బి లిమిటెడ్ యాజమాన్యం మూసివేతను ఆపాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు హరి కోరారు. ఆదివారం మంత్రి సవితకు వినతిపత్రం అందించారు. పరిగి మండలం కొడిగెనహళ్లి పంచాయతీ పరిధిలోని ప్రీకాట్ బీ లిమిటెడ్ స్పిన్నింగ్ మిల్లు యాజమాన్యం స్థాపించి 42 ఏళ్లయ్యిందన్నారు. నూలు వ్యాపారాలతో లాభాలు గడిస్తూ, అనుబంధ సంస్థలు స్థాపించిన సంస్థ.. ప్రభుత్వం దృష్టికి గాని కార్మికులకు గానీ తీసుకెళ్లకుండా ఉన్నపళంగా మూసివేత ప్రయత్నాలు చేయడం సరికాదన్నారు. వందలాది కుటుంబాలు వీధిన పడతాయన్నారు. వెంటనే సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సంస్థను యథావిధిగా నడిచేలా చర్యలు చేపట్టాలని కోరారు. నాయకులు బాబావలి, నాగిరెడ్డి, నాగభూషణ, గోపాలప్ప, శివకుమార్, నందకుమార్, బైలప్ప తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం



కంబన్న (ఫైల్)

రొళ్ల: మండలంలోని కె.గొల్లహట్టికి చెందిన కంబన్న (75) అదృశ్యమైనట్లు ఆదివారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలు. కంబన్న ఆరోగ్య సమస్యతో పాటు మతిస్థిమితం సరిగా లేకపోవడంతో ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయేవాడు. వారం, పది రోజులకు ఒకసారి ఇంటికి వచ్చేవాడు. ఇటీవల ఇంటి నుంచి వెళ్లిపోయిన కంబన్న తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పలుచోట వెతికినా ఫలితం లేకుండా పోయింది. కంబన్న కుమారుడు తిమ్మరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 99899 05061, 90142 66961 నంబర్లకు సమాచారం అందించాలన్నారు.

క్లుప్తంగా

కొత్త వాహన చట్టాలపై అవగాహన అవసరం



రొద్దంలో కొత్త చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ నరేంద్ర

రొద్దం: వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పక హెల్మెట్ ధరించాలని ఎస్‌ఐ నరేంద్ర తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో కొత్త వాహన చట్టాలపై అవగాహన కల్పించారు. అతివేగంగా వాహనాలు నడిపి ప్రమాదాలను కొని తెచ్చుకోవద్దన్నారు. మైనర్లు, లైసెన్స్ లేని వారు వాహనాలు నడపరాదన్నారు. మోటార్ వాహన చట్టం, హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు.

మత్తు పదార్థాలు ప్రాణాంతకం



యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రంగడుయాదవ్

పరిగి: మత్తు పదార్థాల వినియోగం ప్రాణాంతకమని, యువత, విద్యార్థులే కాకుండా అన్ని వయసుల వారికి చెడు ప్రభావాన్ని కలిగిస్తాయని ఎస్‌ఐ రంగడుయాదవ్ తెలిపారు. ఆదివారం మండలంలోని కొడిగెనహళ్లి, సేవామందిరంలో భగత్ సింగ్ సేవా సమితి ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్, సైబర్ సెక్యూరిటీ అవేర్‌నెస్, ప్రొటెక్టింగ్ ద డిజిటల్ వరల్డ్, బీ సేఫ్ ఆన్‌లైన్ అంశాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత వీధులలో అవగాహన ర్యాలీ చేశారు. అనంతరం ఏపీఆర్ఎస్ కొడిగెనహళ్లి, ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలల్లో ఈఅంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో భగత్ సింగ్ సేవాసమితి అధ్యక్షుడు కార్తీక్, డాక్టర్ తారకనాథ్, యాంటీ సైబర్ క్రైమ్ టీమ్ మెంబర్స్ వేణుగోపాల్, శ్రీధర్, టీచర్లు రామలింగయ్య, అరుణ్, లక్ష్మీనారాయణ, శంకర్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయలు

గోరంట్ల: మండల పరిధిలోని గుమ్మయ్యగారి పల్లి సమీపంలో కొత్తచెరువు – గోరంట్ల ప్రధాన రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఖాజాపురానికి చెందిన ఈశ్వరప్ప, రాజేష్ గాయపడినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. ఈశ్వరప్ప, రాజేష్ గోరంట్ల నుంచి సొంతూరుకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా పుట్టపర్తి నుంచి గోరంట్ల వైపు వెళ్తోన్న కారు ఢీకొనింది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ గాయాలయ్యాయి.

ఈ-కేవైసీ వేగవంతం చేయాలి

రొళ్ల: మండల వ్యాప్తంగా తెల్ల రేషన్‌కార్డుల్లో పేర్లు కలిగి ఉండి అందుబాటులో లేని (మిస్సింగ్ సిటిజన్స్) లబ్ధిదారులతో ఈ-కేవైసీ వేగవంతం చేయించడానికి డీలర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ షేక్షావలి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం రొళ్ల మండలంలో 760 మంది వరకూ మిస్సింగ్ సిటిజన్స్‌ను డేటాలో గుర్తించడం జరిగిందన్నారు. తెల్లరేషన్ కార్డులో పేర్లు ఉండి కొన్నేళ్లుగా షాపుల వద్దకు రాకుండా కుటుంబ సభ్యుల్లో ఒకరు వచ్చి రేషన్ పొందేవారని తెలిపారు. అయితే ఇప్పటి వరకు వేలి ముద్రలు వేసి రేషన్ పొందని వారితో డీలర్లు ఈ-కేవైసీ చేయించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. కార్డుల్లో పేర్లు ఉండి ఒకవేళ ఈ-కేవైసీ చేయించకపోతే రేషన్ కార్డుల నుంచి పేర్లను తొలగించడం జరుగుతుందని గుర్తు చేశారు. ఈ విషయాన్ని రేషన్ లబ్ధిదారులు గమనించి ఈ-కేవైసీ చేయించుకోలేని వారు తప్పనిసరిగా డీలర్ల వద్ద ఈ-కేవైసీ చేయించుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు.

బాలికలు అన్నిరంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న సునీత

పుట్టపర్తి టౌన్: బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని పట్టణ సీఐ సునీత సూచించారు. ఆదివారం పట్టణ సమీపంలో ఉన్న శిల్పారామంలో సీఐ సునీత ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా వారోత్సవాల్లో భాగంగా విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గించేందుకు హ్యాపీ అవర్స్ పేరుతో కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ మహిళా సాధికారతతోనే సమాజం అభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బాలికలు, మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్నట్లయితే వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098, పోలీస్ అత్యవసర సేవలకు 100, నేషనల్ ఎమర్జెన్సీ నంబర్‌కు ఫిర్యాదు చేస్తే వెంటనే స్పందిస్తామన్నారు. ఉపాధ్యాయురాలు వరలక్ష్మి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.